క్లుప్తంగా

వైభవంగా షష్టి పూజలు



ప్రత్యేక అలంకరణలో వళ్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి

కార్వేటినగరం: కార్వేటినగరం ప్రసిద్ధ స్కంధపుష్కరిణి సమీపంలో వెలసిన వళ్లీదేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయంలో షష్టి పూజలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి మూలవిరాట్‌కు అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. ఆలయ అధ్యక్షుడు కేశవరెడ్డి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం



కార్వేటినగరం: కార్వేటినగరం ప్రసిద్ధి రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో హిమభరత్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని శనివారం శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ పేదలకు అన్నదానం చేయాలనే ఔదార్యం కలిగిన దాతలు ముందుకు వచ్చి వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రతి శనివారం నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో పాలు పంచుకుని తమ దాతృత్వాన్ని చాటుకోవాలని కోరారు. టీటీడీ వారు ప్రారంభించిన అన్నదాన కార్యక్రమాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి శనివారం నిర్వహించే ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోఅరు. కార్యక్రమంలో టీటీడీ ఆలయ సిబ్బందులు, భక్తులు పాల్గొన్నారు.

పిల్లల్లో సామర్థ్యాలను పెంచేలా అభ్యసనాలు



మాట్లాడుతున్న ఎంఈఓ విజయకుమార్

కార్వేటినగరం: విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచే విధంగా ఉపాధ్యాయులు విద్యాబ్యాసన చేపట్టాలని ఎంఈఓ విజయకుమార్ అన్నారు. శనివారం ఆర్కేఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహించిన టీఎఆర్ఎల్ శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఎంఈఓ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో విద్యాసామర్థ్యం పెరిగే విధంగా ప్రయోగాత్మకంగా విద్యాబోధన చేయాలని సూచించారు. అదేవిధంగా ప్రభుత్వం 1వ తరగతి నుంచి నూతనంగా ప్రవేశపెట్టిన ఆంగ్ల మాధ్యమాన్ని మరింత సులభ పద్ధతిలో పిల్లలకు అభ్యసించాలని సూచించారు. అనంతరం అదనపు ఎంఈఓ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో విషయ నిపుణులు కరణం గిరిబాబు, రఘురామకృష్ణ, నరేష్, సర్దార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ



విద్యార్థులకు విద్యాసామగ్రిని అందిస్తున్న పూర్వ విద్యార్థి నవీన్‌కుమార్

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం): మండల పరిధిలోని పాచిగుంట ప్రాథమిక పాఠశాలలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాజేంద్రనాయుడు కుమారుడు నవీన్‌కుమార్ పాఠశాల విద్యార్థులకు రూ.25 వేలు విలువ చేసే విద్యాసామగ్రిని శనివారం వితరణగా అందించారు. ఈ సందర్భంగా నవన్‌కుమార్ మాట్లాడుతూ తాను ఇదే పాఠశాలలో విద్యను అభ్యసించానని, ప్రస్తుతం బెంగళూరులో వ్యాపారరీత్యా స్థిరపడ్డానని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాలతోపాటు తాను కొంతవరకు విద్యార్థులకు అండగా నిలవాలన్న ఉద్దేశంతో విద్యాసామగ్రిని అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు



హరి అరెస్టు చూపిస్తున్న ఎస్‌ఐ సురేష్

పాలసముద్రం : మండలంలోని బలిజకండ్రిగలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు శనివారం ఎస్‌ఐ సురేష్ తెలిపారు. ఆయన కథనం మేరకు వైన్స్‌షాపు తెరవక ముందే హరి ఇంట్లో మద్యం విక్రయిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు తమ సిబ్బందులతో బలిజకండ్రిగ హరి ఇంట్లో తనిఖీ చేశారు. ఇంట్లో 60 మద్యం బాటిళ్లు దొరికాయి. వెంటనే హరిని అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైతులకు పూర్తి సహకారం

- వైఎస్సార్ జలకళ బోర్లకు ఉచిత మోటార్లు, పరికరాల పంపిణీ
- అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సాయం అందాలి
- ఇదే జగనన్న సురక్ష పథకం ప్రధాన ధ్యేయం
- మంత్రి ఆర్‌కే రోజా



రైతులకు మోటార్లు అందిస్తున్న మంత్రి ఆర్కేరోజా

నగరి : ప్రస్తుత ప్రభుత్వంలో రైతులకు పూర్తి సహకారం అందుతోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. తన నివాస కార్యాలయం వద్ద శనివారం వైఎస్సార్ జలకళ లబ్ధిదారులకు రూ.13.60 లక్షల విలువచేసే విద్యుత్ మోటార్ల పరికరాలను ఆమె పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ వ్యవసాయాన్ని పండుగలా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ జలకళ పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. ఈ పథకంతో మెట్ట భూముల్లో ఉచితంగా బోర్లు వేసి, మోటారు, పరికరాలు కూడా అందిస్తోందని గుర్తుచేశారు. నియోజకవర్గంలో జలకళ పథకంలో ఉచిత బోర్లు వేసుకున్న రైతులు నగరి మండలం గుండ్రాజుకుప్పం గ్రామానికి చెందిన కె.నాగరాజు, తెరణి గ్రామానికి చెందిన ఎస్‌పి.పెరుమాల్, వీఎస్‌ఆర్ పేట గ్రామానికి జి.నిశాంత్, విజయపురం మండలం జగన్నాథపురానికి చెందిన ధనంజయులు, టీ.దేశయ్య, విజయపురం గ్రామానికి చెందిన జి.మణికి విద్యుత్ మోటార్లు, ఇతర పరికరాలను అందించారు. ఈ కార్యక్రమంలో డ్వామా ఏపీడీ శోభన్ బాబు, ఇన్‌చార్జి చంద్రశేఖర్ ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, వైస్‌చైర్మన్ వెంకటరత్నం రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయండి

నోరు తెరిచి అడగలేక, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లిన సమయంలో అందుబాటులో లేక, పొరపాటున ఎక్కడైనా, ఎవరైనా పథకాలు పొందకుండా మిగిలిపోయి ఉంటే వారిని గుర్తించి వారికి లబ్ధి చేకూర్చడమే 'జగనన్న సురక్ష' పథకం ధ్యేయమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. శనివారం పీవీకే కల్యాణ మండపంలో పుత్తూరు మున్సిపాలిటీ, మండలం, నగరి మండలం, వడమాలపేట మండలాల వారికి నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం చాలా అద్భుతమైన కార్యక్రమమని, దీన్ని అందరూ ఒక బాధ్యతగా తీసుకుని విజయవంతం చేయాలన్నారు. అర్హులైన ఉండి ఏఒక్కరూ కూడా పలానా సేవలు కాని, పలానా లబ్ధి కాని అందలేదని చెప్పే అవకాశం ఉండకూడదన్నారు. జల్లెడ పట్టి మరీ అర్హులను గుర్తించి పథకాలే కాదు వారికి కావల్సిన సర్టిఫికెట్లు కూడా అందజేయాలన్నారు. ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి వాటిని దూరం చేయడానికి నిత్యం పాటు పడే ఏకైక ముఖ్యమంత్రి జగనన్నే అన్నారు. ఆయన బాటలోనే తాము నడుస్తున్నామని తెలిపారు. అదే బాటలో గ్రామాల్లో ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి సమగ్ర సమాచారం సేకరించి సమస్యలు తెలుసుకుని వారిని క్యాంపునకు తీసుకురావాలన్నారు. అక్కడ వారి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో పుత్తూరు మున్సిపల్ చైర్మన్ హరి, నగరి, పుత్తూరు, వడమాలపేట ఎంపీపీలు భార్గవి, మునివేలు, విజయలక్ష్మి, మున్సిపల్, మండల సచివాలయ కన్వీనర్లు, వైస్ చైర్మన్లు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష



కొమరగుంటలో మాట్లాడుతున్న ఎంసీఓ మురళి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ప్రత్యేక అధికారి ప్రసాద్

వెదురుకుప్పం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ విజయవంతం చేయాలని మండల కోఆర్డినేటర్ మురళి అన్నారు. శనివారం మండలంలోని కొమరగుంట, వెదురుకుప్పం గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్షపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందకుంటే తక్షణమే గుర్తించి వారికి వర్తింపజేయాలని సూచించారు. 11 రకాల సేవలను అందించేందుకు ప్రభుత్వం ప్రజల వద్దకు వెళ్లాలనే సంకల్పంతోనే ఈకార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. ప్రతిఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా చేయడానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు జగదీశ్వర్‌రెడ్డి, రమేష్, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం : జగనన్న సురక్ష పథకం ప్రజలకు ఓ వరం అని మండల ప్రత్యేక అధికారి ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన 49 కొత్తపల్లిమిట్ట, ముద్దికుప్పం గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలకు జగనన్న సురక్ష పథకం ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం జూలై 1వ తేదీ నుంచి ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమానికి తహసీల్దార్ లోకనాథపిళ్లై, ఎంపీడీఓ కృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శి కోదండరెడ్డి సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ యూనియన్ సభ్యులు

నగరి : సమాన పనికి సమాన వేతనం కల్పించాలని మున్సిపల్ ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్ వర్కర్ల ట్రేడ్ యూనియన్ వారు నిరసన వ్యక్తం చేశారు. శనివారం మున్సిపల్ కార్యాలయం వద్ద తమ డిమాండ్లను వ్యక్తపరుస్తూ నినాదాలు చేశారు. సమాన పనికి సమాన వేతనం అందించాలని, టైం స్కేల్ వర్తింపజేయాలన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

తీరిన రోడ్డు సమస్య



సిమెంటురోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చైర్మన్ నీలమేఘం

నగరి : మున్సిపల్ పరిధిలోని నగరి దళితవాడలో ఎంతోకాలంగా ఉన్న రోడ్డు సమస్య పరిష్కారమైంది. దళితవాడలో మంత్రి ఆర్‌కే రోజా గతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించినప్పుడు స్థానికులు రోడ్డు ఏర్పాటు చేయాలని ఆమెకు విన్నవించారు. దీనిపై స్పందించిన ఆమె వెంటనే అధికారులతో మాట్లాడి రోడ్డు వేయాలని ఆదేశాలు జారీచేశారు. దీంతో యుద్ధ ప్రాతిపదికన శనివారం సిమెంటు రోడ్డును నిర్మించారు. నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, కమిషనర్ వెంకట్రామిరెడ్డి పర్యవేక్షించారు. అడిగిన వెంటనే సమస్య పరిష్కరించిన మంత్రి రోజాకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీఈ నరేష్ బాబు, ఏఈలు రమేష్, నవీన్ పాల్గొన్నారు.

సారా ఊట ధ్వంసం

పుత్తూరు రూరల్: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ కృష్ణ, ఎస్‌ఐ నాగరాజుల బృందం శనివారం పుత్తూరు, నారాయణవనం మండలాల్లో దాడులు నిర్వహించింది. దాడుల్లో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి, 300 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. అరెస్ట్ అయిన వ్యక్తి నారాయణవనం మండలం, కీళగరం గ్రామానికి చెందిన ఎస్.వినోద్(30)ను రిమాండ్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు.

పరిసరాల శుభ్రత మన బాధ్యత



వనదుర్గాపురం పంచాయతీలో పర్యటిస్తున్న అధికారులు

పాలసముద్రం : మండలవ్యాప్తంగా గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్, తహసీల్దార్ బాబు తెలిపారు. శనివారం వనదుర్గాపురం పంచాయతీలోని గ్రామాల్లో సర్పంచ్ నరసింహరాజుతో కలసి పర్యటించారు. గ్రామస్తులతో ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ చేరి అందుల్లో దోమలు వృద్ధి చెంది రోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. అందువల్ల ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రీన్‌అంబాసిడర్లు గ్రామాల్లో పర్యటించి సాయంత్రం మలాథిన్ మందు పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ ఉన్నారు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



అప్పలాయగుంట గ్రామోత్సవంలో శ్రీనివాసుడు

పుత్తూరు రూరల్: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం శనివారం వైభవంగా జరిగింది. వేకువజామున సుప్రభాత సేవతో శ్రీనివాస స్వామిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయల్లో ఆశీనులను చేశారు. భక్తి కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్‌సేవ కనుల పండువగా జరిగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరీలతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మేళతాలాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో విహరించారు. ఈ సందర్భంగా భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులను కటాక్షించి ఆలయానికి చేరుకున్న స్వామి, అమ్మవార్లకు మంగళ హారతులిచ్చారు. కార్యక్రమాలను ఆలయ అధికారి శివకుమార్, రమణాచార్యులు పర్యవేక్షించారు.

ఆగ్రహించిన అగ్రహారం గ్రామస్తులు

- తక్కరాసు గుంటపై కోర్టులో నడుస్తున్న కేసు
- గుంటను అన్యాక్రాంతం కానివ్వం అంటూ అగ్రహారం గ్రామస్తుల ఫైర్
- ఫెన్సింగ్‌ను తొలగించిన గ్రామస్తులు



ఫెన్సింగ్‌ను తొలగిస్తున్న అగ్రహారం గ్రామస్తులు

పుత్తూరు రూరల్: పట్టణ పరిధిలో ఉన్న అగ్రహారం గ్రామస్తులు ఆగ్రహించడంతో రూ.కోట్లు విలువ చేసే మంచినీళ్ల గుంట కబ్జాదారుల కోరల నుంచి విముక్తి పొందింది. రాత్రికి రాత్రే ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు అంతా శనివారం ఒక్కటై నేలమట్టం చేశారు. పుత్తూరు మున్సిపాలిటీ రెండో వార్డులోని కేఎం అగ్రహారంలో తక్కరాసు తాగునీటి గుంట వందేళ్లకు పైగా గ్రామస్తుల దాహార్తిని తీరుస్తున్న చరిత్ర కలిగింది. ఈ గుంట చుట్టూ శనివారం ఉదయం వెలసిన ఫెన్సింగ్‌ను చూసిన గ్రామస్తులు రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు సమాచారం అందించారు. ఆర్‌ఐ స్వరూపరాణి, మున్సిపల్ టీపీఓ మూర్తి సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. ఈ గుంట వ్యవహారం కోర్టులో ఉందని, గుంట స్థలం తమదే అంటున్న వారు, గ్రామస్తులు ఎవరూ గుంటలోకి ప్రవేశించవద్దని చెప్పి వెళ్లిపోయారు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు ఫెన్సింగ్‌ను నేలమట్టం చేశారు.

వివరాల్లోకి వెళ్తే..

తిరుపతి–చెన్నై జాతీయ రహదారికి ఆనుకుని ఈశ్వరాపురం రెవెన్యూ లెక్క దాఖలాలోని సర్వే నంబర్ 230/1లో 2.24 ఎకరాల విస్తీర్ణంలో భూమి ఉంది. ఇందులో జాతీయ రహదారి ఏర్పాటులో 0.49 సెంట్లు పోగా 1.75 ఎకరాలు మిగిలింది. అయితే తక్కరాసు గుంట తమదేనని వడమాలపేట మండలం శ్రీబొమ్మరాజుపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి హైకోర్టును ఆశ్రయించాడు. దీనిపై 2022లో పుత్తూరు తహసీల్దార్ హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు.

పూర్వాపరాలు పరిశీలిస్తే..

తక్కరాసు గుంట తమ పూర్వీకుల నుంచి తమకు సంక్రమించిందని పేర్కొంటూ 2009లో పుత్తూరుకు చెందిన ఏకే రంగభాష్యం అనే వ్యక్తి పట్టాదార్ పాసుపుస్తకం మంజూరు చేయాలని స్థానిక రెవెన్యూ శాఖకు దరఖాస్తు చేసుకున్నాడు. గుంట కావడంతో టైటిల్‌డీడ్ ఇవ్వడం కుదరదని అధికారులు తేల్చి చెప్పారు. దీనిపై 2010లో రంగభాష్యం హైకోర్టును ఆశ్రయించగా, రెవెన్యూ అధికారులు టైటిల్ డీడ్ మంజూరు చేశారు. అనంతరం రెవెన్యూ అధికారులు మళ్లీ దానిపై రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో రంగభాష్యం కుమారుడు అజయ్ ఈ గుంట భూమిని శ్రీబొమ్మరాజుపురం గ్రామానికి చెందిన జి.రవివర్మ పేరిట జీపీఏ చేయడానికి ప్రయత్నించగా సబ్ రిజిస్ట్రార్ నిరాకరించారు. దీంతో అతను హైకోర్టును ఆశ్రయించాడు. మరోవైపు గుంట స్థలం తమదేనంటూ రవివర్మ ఫెన్సింగ్ వేయడంతో గ్రామస్తులు దాన్ని శనివారం నేలమట్టం చేశారు.

సంక్షేమంలో మన ప్రభుత్వమే టాప్



ఇంటి స్థలాలను కేటాయించాలని ఆర్డీఓ రేణుకకు సూచిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం) : రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమము రెండు కళ్లుగా ప్రతి ఇంటికీ గడప వద్దకే ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించడంలో రాష్ట్రంలో ప్రభుత్వం ప్రథమ స్థానంలో ఉందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. శనివారం వరత్తూరు గ్రామ సచివాలయాల పరిధిలోని కాలేపల్లి, రాఘవరెడ్డిపల్లి, బోడపూరు, కుమ్మరపల్లి, ఒగ్గోరుపల్లి, వరాలకండ్రిగ, దలవాయిపల్లి, సంసాపురం సర్పంచ్ నరసింహులు, ఎంపీటీసీ లోక ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. సంసాపురం గ్రామానికి రూ.15 లక్షలతో సీసీ రోడ్డు వేయాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వ లేకే ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయన్నారు.

ఆర్బీకే ప్రారంభం..

స్థల దాత దంపతులకు అభినందించిన డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మండల పరిధిలోని వరత్తూరు పంచాయతీకి చెందిన కాలేపల్లిలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్యకేంద్ర భవన నిర్మాణానికి స్థలం ఇచ్చిన నారాయణరెడ్డి దంపతులను అభినందించారు. స్థల దాత నారాయణరెడ్డి, డిప్యూటీ సీఎం నూతన భవనాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందుతుందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. రైతులు ఆర్బీకేల ద్వారా అందించే సేవలను సద్వినియగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనిత, వైఎస్ ఎంపీపీ హరిబాబు, ఏకాంబరం, లోకనాథరెడ్డి, ఎంపీడీఓ శ్రీదేవి, తహసీల్దార్ ఇన్బనాథన్, నాయకులు మణి, శివ అయ్యప్ప, గోపాల్‌రెడ్డి, రాజారెడ్డి, మేఘునాథరెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, వెంకటరెడ్డి, దామోదరం మండల పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు పక్కాగృహాలు అందించండి

ప్రతి పేదవాడికి పక్కాగృహాలు మంజూరు చేసి ఇంటి నిర్మాణాలు చేపట్టి వారి సొంతింటి కలను నెరవేర్చడమే రాష్ట్రప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. శనివారం కాళేపల్లిలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు గ్రామస్తులు తమ సమస్యను విన్నవించారు. తమకు ఇంటి పట్టాలు మంజూరు చేశారు కానీ, స్థలాలు చూపించలేదని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయమై ఆయన, వెంటనే చిత్తూరు ఆర్డీఓ రేణుకతో ఫోన్‌లో మాట్లాడారు. లబ్ధిదారులకు ఇంటి స్థలాలను కొలతలు వేసి వారికి కేటాయించాలని ఆదేశించారు. ఆర్డీఓ రేణుక వెంటనే ఆ గ్రామానికి చేరుకుని మంత్రితో మాట్లాడారు. వెంటనే ఇంటి స్థలాలను చూపి నిర్మాణాలు చేపట్టే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ 2024 నాటికి ప్రతి ఒక్కరూ సొంతింట్లో ఉండేలా చేస్తామని లబ్ధిదారులకు మంత్రి హామీ ఇచ్చారు.

తొలిరోజు 'సురక్ష' స్పందన బాగుంది



పాదిరేడులో వలంటీర్ ప్రశ్న, మహిళ జవాబును ఆలకిస్తున్న కలెక్టర్

పుత్తూరు రూరల్: 'జగనన్న సురక్ష' తొలిరోజు స్పందన బాగుందని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. వడమాలపేట మండలం పాదిరేడు, పుత్తూరు మండలం గోపాలకృష్ణాపురం గ్రామాల్లో జగనన్న సురక్ష పథకం అమలును శనివారం కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాదిరేడు గ్రామంలో వలంటీర్లతో కలసి ఇంటింటికీ వెళ్లిన కలెక్టర్ మహిళతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మరో ఇంటి వద్దకు వెళ్లి వలంటీర్‌ను మహిళతో మాట్లాడాలని చెప్పారు. ప్రశ్న, జవాబులను ఆలకించిన కలెక్టర్ ఇళ్ల వద్దకు వెళ్లే వలంటీర్లు కుటుంబ సభ్యులకు ప్రభుత్వ పథకాలను అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. గురుకుల పాఠశాలలోని విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలు గురించి ఆరా తీశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభమైందని తెలిపారు. తొలిరోజు కార్యక్రమంలో వలంటీర్ల పనితీరు, ప్రజల స్పందన బాగుందన్నారు. నెల రోజుల పాటు జరిగే కార్యక్రమంలో వలంటీర్లు, అధికారులు ఇంటింటికి వెళ్లి 11 రకాల ధృవపత్రాల గురించి వివరించి, అర్హత గల కుటుంబాలకు 7 రోజుల తర్వాత అవసరమయ్యే ధృవపత్రాలను నమోదు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వడమాలపేట తహసీల్దార్ సుబ్రమణ్యం, వడమాలపేట, పుత్తూరు ఎంపీడీఓలు భానుమూర్తి, ఇందిర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ద్రౌపది, ధర్మరాజులస్వామికి పూజలు



ప్రత్యేక అలంకరణలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి



బంగారు ఆభరణాలను వితరణ చేస్తున్న దేవారెడ్డి దంపతులు

కార్వేనగరం: మండలకేంద్రంలో వెలసిన శ్రీద్రౌపదీ ధర్మరాజులస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు శనివారం అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. వడ్డెర కులస్తులు ఉభయదారులుగా వ్యవహరించి సాయంత్రం అమ్మవారికి సారెను సమర్పించారు. రాత్రి అర్చకులు అమ్మవారిని పట్టువస్త్ర సుగంధ భరిత పుష్పాలు, స్వర్ణాభరణాలతో అలంకరించి ప్రత్యేక వాహనంపై ప్రతిష్టించి పురవీధుల్లో బాణసంచా పేల్చుతూ వైభవంగా ఊరేగించారు. అదేవిధంగా స్థానికులు దేవారెడ్డి, లలిత దంపతులు అమ్మవారికి రూ.10 వేలు విలువ చేసే బంగారు ఆభరణాన్ని ఆలయ అధ్యక్షుడికి అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పోకల సోమనాథ్, కమిటీ సభ్యులు హరిబాబు, శివప్రకాష్, బాబురెడ్డి, కృష్ణయ్య, ఉభయదారులు, భక్తులు పలువురు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలోనే నాణ్యమైన విద్య



జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు అందిస్తున్న హెచ్‌ఎం మీనాక్షి

పాలసముద్రం : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందని ప్రధానోపాధ్యాయురాలు మీనాక్షి తెలిపారు. శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో ఆమె సమీక్ష నిర్వహించారు. హెచ్‌ఎం మీనాక్షి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం జగనన్న విద్యాకానుక కిట్లు, అమ్మఒడి, పౌష్టికాహారంతో కూడిక మధ్యాహ్న భోజనం, నాడు–నేడు కింద స్కూళ్లలో మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ముందుకు సాగాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు, యూనిఫాం అందించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి



శానిటేషన్ ఆటోను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ నీలమేఘం

నగరి : పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం అన్నారు. శనివారం పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా శానిటరీ అధికారులు సిద్ధం చేసిన ఆటోను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పలు వాహనాలు చెత్తసేకరణ నిమిత్తం ఏర్పాటు చేశామన్నారు. చిన్నసందుల్లో వెళ్లి చెత్త సేకరించేందుకు గానూ ఆటోను సిద్ధం చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం వర్షాకాలం గనుక నివాసితులు ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా ఇంటి వద్దే బుట్టల్లో సేకరించి మున్సిపల్ వాహనాల్లో వేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బాలన్, కౌన్సిలర్ గోపాల్ రెడ్డి, డీఈ నరేష్, ఏఈ రమేష్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం పాల్గొన్నారు.